సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 8 । జనవరి । 2023



భక్తుల రద్దీ సాధారణం

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. పెద్ద పండగ ముందు రోజులు కావడమే కారణమని ఆలయ సిబ్బంది అంటున్నారు.



శోభాయమానం

ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు, ద్రవిడ ప్రబంధ అధ్యయనోత్సవాల్లో భాగంగా ఉదయం, రాత్రి తిరువీధి సేవలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి.

వరాల వెంకన్నకు పూజలు

అత్తిలి: ఈడూరులోని వరాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీవారు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు.



న్యూస్‌రీల్

గ్రూప్-1 పరీక్షలకు 10 కేంద్రాలు : కలెక్టర్



సాక్షి, భీమవరం: ఏపీ పీఎస్సీ గ్రూప్-1 పరీక్షలకు భీమవరంలో 10 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శనివారం మీడియాకు ఆమె వివరాలు వెల్లడించారు. జిల్లాలో పరీక్షలకు 4,063 మంది దరఖాస్తు చేసుకున్నారని, వీరి కోసం భీమవరంలోని కేజీఆర్‌ఎల్, డీఎన్నార్, విష్ణు ఇంజనీరింగ్, వీఎస్‌కే డిగ్రీ, సీఎస్ఎన్, బ్రౌనింగ్ జూనియర్, శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. ఈ మేరకు లైజనింగ్, చీఫ్ సూపరింటెండెంట్లను నియమించామన్నారు. సమన్వయ అధికారిగా ఇన్‌చార్జి డీఆర్వో దాసి రాజు వ్యవహరిస్తారన్నారు. కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరన్నారు. గర్భిణులు, దివ్యాంగ అభ్యర్థులకు కింది అంతస్తులో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేయాలని సూచించామన్నారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పరీక్షల విజయవంతానికి కృషిచేయాలని ఆమె కోరారు.

సేంద్రియ సాగుతో మేలు

తాడేపల్లిగూడెం: సేంద్రియ వ్యవసాయం అవసరమని శనివారం వెంకట్రామన్నగూడెంలోని కేవీకేలో జరిగిన ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన సదస్సులో శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రధాన శాస్త్రవేత్త ఈ.కరుణశ్రీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో సాంకేతికత జోడించి జీవన ఎరువులు, జీవ నియంత్రణ కారకాల తయారీ గురించి అవగాహన పెంచుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. క్షేత్రస్థాయిలో జీవన ఎరువులు, జీవ నియంత్రణ కారకాల వినియోగం గురించి డీపీఎం తాతారావు వివరించారు. సేంద్రియ సాగుతో భూమి సారవంతం అవుతుందని శాస్త్రవేత్త ఎం.రాఘవేంద్రరెడ్డి అన్నారు. వివిధ మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

ముగిసిన ఉద్యాన కళాశాలల పోటీలు



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న వీసీ

తాడేపల్లిగూడెం: వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీలో మూడు రోజులుగా జరుగుతున్న పదో అంతర కళాశాలల క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి అతిథిగా హాజరైన వీసీ టి.జానకిరామ్ మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగిన పోటీల్లో 300 మందికి పైగా విద్యార్థులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల మధ్య సహృద్భావ వాతావరణం, పోటీతత్వం మాత్రమే ఉన్నతస్థాయికి తీసుకు వెళుతుందన్నారు. విజేతలు జాతీయస్థాయిలో పోటీపడి యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆర్‌బీకేల ద్వారా తక్కువ ధరకే ఉత్పత్తులు

ఏలూరు(మెట్రో): రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు తక్కువ ధరకే వివిధ రకాల ఉత్పత్తులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఆగ్రోస్) ఉమ్మడి జిల్లాల మేనేజర్‌లు జె.కృష్ణయ్య, నరసరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 48 మండలాల్లో వ్యవసాయ యంత్రాలు, యాంత్రీకరణ పనిముట్లను రైతులకు విక్రయిస్తామని, రైతు సేవా కేంద్రాల ద్వారా నిరుద్యోగ పట్టభద్రులు, పాలిటెక్నిక్ డిప్లమో అభ్యర్థులకు అవకాశం కల్పించి ఆయా సేవా కేంద్రాల్లో ఈ వ్యవసాయ పనిముట్లను అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆగ్రోస్ ఆధ్వర్యంలో ప్రతి మండలంలో రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ 99480 76859లో సంప్రదించాలని కోరారు.

లక్ష్యానికి మించి.. ధాన్యం కొనుగోళ్లు

అన్నదాతకు ప్రాధాన్యం
- ధాన్యం సేకరణలో ముందంజ
- 3.52 లక్షల టన్నుల కొనుగోలు
- మరింత కొనుగోలుకు ప్రభుత్వ అనుమతి



సిరుల పంట: భీమవరం ప్రాంతంలో ధాన్యం పట్టుబడులు (ఫైల్)

సాక్షి, భీమవరం: ప్రభుత్వం చేపట్టిన చర్యలతో జిల్లాలో సార్వా ధాన్యం కొనుగోళ్లు లక్ష్యానికి మించి సాగుతున్నాయి. సార్వా సీజన్ ప్రారంభం నుంచి అధిక వర్షాలు కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం చేపట్టిన నూతన విధానంతో రైస్‌మిల్లర్లు, దళారుల ప్రమేయం లేకుండా మద్దతు ధరకు ధాన్యాన్ని విక్రయిస్తున్నారు. జిల్లాలోని 19 మండలాల పరిధిలో సుమారు 1.90 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రభుత్వం నారుమడుల నుంచి ధాన్యం విక్రయాల వరకూ రైతులకు అండగా నిలవగా.. సార్వా పంట అధిక దిగుబడులను ఇచ్చింది.

3.42 లక్షల టన్నుల లక్ష్యం

జిల్లాలో రైతు భరోసా కేంద్రాల ద్వారా 3.42 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించి ప్రభుత్వం సుమారు 300కు పైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసింది. ఇప్పటివరకూ 78 వేల రైతుల నుంచి రూ.717 కోట్ల విలువైన 3,52,600 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. వీరిలో 56 వేల మంది రైతులకు సుమారు రూ.521 కోట్లను వారి బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. గతనెల 23వ తేదీ వరకూ ధాన్యం విక్రయించిన రైతులకు సొమ్ములు జమయ్యాయి. మిగిలిన రూ.196 కోట్ల ధాన్యం సొమ్ములను సంక్రాంతి పండగకు ముందుగానే అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ధాన్యం నిల్వలు ఉండటంతో..

జిల్లాలో 3.42 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినా రైతుల వద్ద ఇంకా ధాన్యం నిల్వలు ఉండటంతో పౌరసరఫరాల శాఖ అధికారులు మరో 32 వేల టన్నుల సేకరణకు ప్రభుత్వాన్ని కోరారు. అయితే ప్రభుత్వం 25 వేల టన్నుల కొనుగోలుకు అవకాశం ఇవ్వడంతో ఈ మేరకు రైతుల నుంచి ధాన్యాన్ని సేకరిస్తున్నారు. ఈ మేరకు కొనుగోలు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోలు చేసి నిర్ణీత సమయంలోపు సొమ్ములు జమచేయడంపై అన్నదాతలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు లక్ష్యం
3,42,000 టన్నులు

ఇప్పటివరకూ కొనుగోలు
3,52,600 టన్నులు

సేకరించిన ధాన్యం విలువ
రూ.717 కోట్లు

రైతుల ఖాతాలకు చెల్లింపు
రూ. 521 కోట్లు

అదనంగా 25 వేల టన్నులు

“ సార్వా ధాన్యం కొనుగోలులో జిల్లా ముందంజలో ఉంది. 3.42 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా.. మరో 25 వేల టన్నులు కొనుగోలుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ధాన్యం విక్రయించిన రైతులకు తక్కువ సమయంలోనే సొమ్ములు ఖాతాల్లో జమచేస్తున్నాం. సంక్రాంతిలోపు పూర్తిస్థాయిలో ధాన్యం సొమ్ములు అందించేలా చర్యలు తీసుకున్నాం.

– టి.శివప్రసాద్, సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్, భీమవరం

ప్రగతి పథంలో నరసాపురం

- మంత్రులు జోగి రమేష్, మేరుగ నాగార్జున
- నరసాపురంలో ముగిసిన ‘గడపగడపకు’ కార్యక్రమం



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు రమేష్, నాగార్జున, చీఫ్‌విప్ ప్రసాదరాజు

నరసాపురం రూరల్: నరసాపురం నియోజకవర్గం ప్రగతి పథంలో దూసుకుపోతోందని, రాష్ట్రంలో తొలిసారిగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నియోజకవర్గంలో విజయవంతంగా పూర్తిచేయడం అభినందనీయమని మంత్రులు జోగి రమేష్, మేరుగ నాగార్జున అన్నారు. మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో గడపగడపకు కార్యక్రమం ముగింపు సభను శనివారం ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అధ్యక్షతను నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నాగార్జున మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో పాలన ప్రశాంతంగా, అభివృద్ధి పథంలో సాగుతుంటే ప్రతిపక్షాలు లేనిపోని రాద్ధాంతాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై చంద్రబాబు కపట ప్రేమను చూపుతున్నారని విమర్శించారు. చంద్రబాబుకు మరోసారి బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు.

పేదల అభ్యున్నతి కోసం..

గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం పాటుపడుతున్న మహోన్నత వ్యక్తి సీఎం జగన్ అన్నారు. రాష్ట్రంలో పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియం చదువులను చేరువ చేయాలని చూస్తే చంద్రబాబు, అతడి తొత్తులు అడ్డుపడ్డారని మండిపడ్డారు. నరసాపురం ప్రాంత అభివృద్ధికి చీఫ్ విప్ ముదునూరి నిరంతరం కృషిచేస్తున్నారని, పట్టుదలతో గడపగడపకు కార్యక్రమాన్ని పూర్తిచేశారని కొనియాడారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చీఫ్‌విప్ ప్రసాదరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని సచివాలయాల పరిధిలో ప్రతి కుటుంబాన్ని కలిసి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించామని చెప్పారు. ముందుగా గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలను మంత్రులతో కలిసి ప్రసాదరాజు ప్రారంభించారు. జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, జేసీ జేవీ మురళి, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి శ్రీనివాస్, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, కనీస వేతనాల కమిటీ రాష్ట్ర చైర్మన్ బర్రి లీలా శంకర్, జెడ్పీటీసీలు బొక్కా రాధాకృష్ణ, తిరుమాని బాపూజీ, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, మున్సిపల్ చైర్మన్ బర్రి శ్రీవెంకటరమణ, ఎంపీపీ మైలాబత్తుల సోనీ, సర్పంచ్ తిరుమాని వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

పాల నురుగులు.. పశువుల సొబగులు

జాతీయస్థాయి పశు ప్రదర్శన, పాల పోటీలు

తాడేపల్లిగూడెం: దేశీయ గోజాతి సంవర్ధక అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో పెదతాడేపల్లి భారతీయ విద్యాభవన్స్‌లో ఆరో జాతీయస్థాయి దేశీ ఆవుల గేదెల ప్రదర్శన, పాల పోటీలు, శ్రేష్టమైన జాతి పశువుల ఎంపిక పోటీలు శనివారం వేకువజామున ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని చిత్తూరు, గుంటూరు, కృష్ణా, ఉభయగోదావరి జిల్లాలతో పాటు మహారాష్ట్ర, గుజరాత్ నుంచి మొత్తం 142 పశువులను పోషకులు తీసుకువచ్చారు. ఉదయం ఆరు గంటల నుంచి పాల దిగుబడులు ప్రారంభమయ్యాయి. రోజులో నిర్దేశిత సమయాల్లో పాలను తీసి, వాటిని కిలోగ్రాముల్లో లెక్కిస్తారు. వివిధ జాతులపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. పశుపోషణ కోసం వినియోగించే దాణా, మందులు, యంత్రాలను ప్రదర్శనకు ఉంచారు. రైతులకు పశువులపై ముఖ్యంగా దేశీయ గోజాతిపై ఆసక్తి పెంచడానికి ఇక్కడ జాతీయస్థాయి ప్రదర్శనను ఏర్పాటుచేశామని ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. రైతులు పంటతో పాటు పాడికి ప్రాముఖ్యమిచ్చి పాడిని తమ కుటుంబంలో భాగస్వామ్యం చేసుకోవాలని కోరారు. నిర్వాహక బాధ్యులు అబ్బాయిరాజు, వై.నారాయణరావు, కె.శివరామకృష్ణ, పి.కృష్ణంరాజు పర్యవేక్షించారు.



ఆవు పాలు తీస్తున్న పశుపోషకులు



పోటీలకు తీసిన పాలు పరిశీలిస్తున్న నిర్వాహకులు

హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక



ఎంపికైన జేఎన్‌టీయూ జట్టు

దెందులూరు: సౌత్‌జోన్ హ్యాండ్‌బాల్ పోటీలకు జేఎన్‌టీయూ (కాకినాడ) జట్టుకు వేగవరం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. కళాశాల ఏఓ కరుణానిధి మాట్లాడుతూ శనివారం కళాశాలలో జరిగిన జేఎన్‌టీయూ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన జట్టు తమిళనాడు సేలంలో జరిగే సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొంటుందన్నారు. కోచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రత్యేక కారాగారం తనిఖీ



తనిఖీ చేస్తున్న జడ్జి పవన్‌కుమార్

సాక్షి, భీమవరం: భీమవరంలోని ప్రత్యేక కారాగారాన్ని శనివారం అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.పవన్‌కుమార్ తనిఖీ చేశారు. రాజీ చేయడానికి వీలుగా ఉన్న కేసుల వివరాలు పరిశీలించారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా నేరారోపణలు ఎదుర్కొంటున్న రిమాండ్ ఖైదీలకు న్యాయ సహాయం అందిస్తామన్నారు. జైలు శిక్ష క్రమశిక్షణ, పరివర్తన, బాధ్యతను నేర్పుతుందన్నారు. వచ్చేనెల 11న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్ ద్వారా ముద్దాయిల కేసులు పరిశీలిస్తారన్నారు. ఉచిత న్యాయ సలహాదారులు బి.లోకేశ్వరరావు, ఎన్.రమేష్, పీఎల్‌వీ కమల్‌రాజు, జైలు పర్యవేక్షణాధికారి డి.వెంకటగిరి, కుమార్‌స్వామి ఆయన వెంట ఉన్నారు.

రెడ్‌క్రాస్‌కు ‘ఉపాధి’ సిబ్బంది విరాళం

ఇరగవరం: ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థకు ఉపాధి హామీ పథకం సిబ్బంది విరాళాలు సేకరించారని డ్వామా పీడీ ఎస్‌టీవీ రాజేశ్వరరావు తెలిపారు. శనివారం తణుకు క్లస్టర్ పరిధిలోని తణుకు, అత్తిలి, ఇరగవరం, ఆచంట, పెనుగొండ, పోడూరు, పెనుమంట్ర, పెంటపాడు, తాడేపల్లిగూడెం మండలాల్లో పనిచేస్తున్న ఉపాధి హామీ పథకం ఏపీఓలు, ఈసీలు, టీఏలు, సీఓలు, బీఎఫ్‌టీలు రూ.67 వేలు విరాళంగా సేకరించడం అభినందనీయమన్నారు. వారి జీతం నుంచి ఎదుటివారికి మంచి చేయాలనే సంకల్పంతో సాయం చేయడం గొప్ప విషయమన్నారు. ఏపీడీఓ వీరాస్వామి, ఉపాధి సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.11.80 లక్షలు

పెదవేగి: రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ దేవస్థానంలో హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. 84 రోజులకు రూ.11,80,490 ఆదాయం లభించినట్టు దేవస్థానం చైర్మన్ చళ్లగోళ్ల వెంకటేశ్వరరావు తెలిపారు. ఏలూరు తనిఖీదారు బాలు పర్యవేక్షణలో లెక్కింపు జరిగిందన్నారు. ధర్మకర్తల మండలి సభ్యులు గరికిముక్కు సర్వేశ్వరరావు, పాకలపాటి వెంకటేశ్వరరావు, మేరుగు వెంకటేశ్వరరావు, నంబూరి జనార్దన్‌రావు, నాగార్జున లక్ష్మీ రాధిక, ఈడా ధర్మారావు, కట్టా నాగరాజు, లింగాల కనకారావు, కార్యనిర్వహణాధికారి సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

యువత దృష్టిని క్రీడల వైపు మళ్లించండి

నూజివీడు: సంక్రాంతి సందర్భంగా కోడిపందేలు, పేకాట, గుండాట, ఇతర జూదాల వైపు మళ్లకుండా యువత క్రీడల వైపు దృష్టి సారించాలని సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్ హితవు పలికారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా మండల, డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీల నిర్వహణపై పీఈటీలు, పీడీలతో శనివారం సబ్‌కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనలను అతిక్రమించి కోడిపందేలను నిర్వహిస్తే ఏపీ గేమింగ్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. జూదాల్లో పాల్గొని ఆర్థికంగా ఇబ్బందులకు గురికావొద్దని సూచించారు. యువత క్రీడల వైపు ఆసక్తి కనబరిచేలా ప్రచారం చేయాలన్నారు. ఈ ఆటల పోటీలలో యువత పాల్గొని జూదాలకు, కోడిపందేలకు దూరంగా ఉండాలన్నారు. డీఎస్పీ ఈ అశోక్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నామని, ఇవి మండల స్థాయిలో, డివిజన్ స్థాయిలో ఉంటాయన్నారు. మండల, డివిజన్ స్థాయిలో గెలుపొందిన వారికి నగదు బహుమతులు అందిస్తామన్నారు. ఎస్సైలు తలారి రామకృష్ణ, కుటుంబరావు పాల్గొన్నారు.

సుపరిపాలనలో జగన్ ప్రభుత్వం ముందంజ

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- తాడేపల్లిగూడెంలో కొత్త పింఛన్ల పంపిణీ



తాడేపల్లిగూడెంలో మహిళకు పింఛను ఇస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

తాడేపల్లిగూడెం అర్బన్ : సుపరిపాలన అందించడంలో మన రాష్ట్రం ముందంజలో ఉందని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయం వద్ద నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుపరిపాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. ఇటీవల నూతనంగా లబ్ధిదారులుగా గుర్తించిన 976 మందికి పింఛను కార్డులతోపాటు ప్రతి లబ్ధిదారునికి రూ.2,750 నగదు అందిస్తున్నామన్నారు. సమర్థవంతుడైన వైఎస్ జగన్ పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉచిత కరెంటు ఇస్తానని చేసి ఎన్నికల హామీని తు.చ తప్పకుండా అమలు చేశారన్నారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి పేదవాడికి కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. తండ్రిని మించిన తనయుడిగా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని హామీలను అమలు చేసిన సమర్థుడు సీఎం వైఎస్ జగన్ అన్నారు. పేద విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో ఫీజు రీయింబర్స్‌మెంటును కొనసాగిస్తూ అమ్మ ఒడి, విద్యాదీవెన, విద్యావసతి, గోరుముద్ద వంటి పథకాలను ప్రవేశపెట్టారన్నారు. గతంలో తన పాలనను చూసి ఓటెయ్యండని వైఎస్సార్ కోరిన రీతిలోనే వైఎస్ జగన్ పాలన చూసి ఓటేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వైఎస్ జగన్ పాలన మాదిరిగా టీడీపీ ప్రభుత్వంలో చేయకపోవడం చంద్రబాబు అసమర్థతను ప్రజలే ఎలుగెత్తి చెబుతున్నారన్నారు.

పవన్‌కల్యాణ్ జనసేన పార్టీ ఏర్పాటు చేసి విడుదల చేసిన మ్యానిఫెస్టోకు ఆకర్షితులై ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు ఆ పార్టీలో చేరారని, అయితే ఇప్పుడు చంద్రబాబు చేతిలో బొమ్మ మాదిరిగా ఎపవన్ తీరు చూసి వారందరూ జనసేన పార్టీ నుంచి దూరమయ్యారని చెప్పారు. కాపు జాతిని అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. తమకు అధికారం ఇస్తే వైఎస్ జగన్ ఇచ్చిన సంక్షేమ పథకాలు రద్దు చేసి రాష్ట్ర ప్రజలను ఆదుకుంటామని చెప్పడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు.

టీడీపీ బతికి బట్టకట్టేది లేదు

టీడీపీ పోస్టుమార్టం అయిపోయిన పార్టీ అని, ఆ పార్టీ బతికి బట్టకట్టేదిలేదని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మంత్రి కొట్టు సత్యనారాయణను కలిసేందుకు పట్టణానికి విచ్చేసిన ఆయన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. టీడీపీ.. కుక్కలాంటిదని, దాని పాలు కుక్కపిల్లకే తప్ప మిగతా వాటికి పనిచేయవన్నారు. వైఎస్సార్ సీపీ ఆవులాంటిదని, దాని పాలు దాని దూడతోపాటు మనం తాగేందుకు, దైవ పూజల్లోనూ ఉపయోగపడతాయన్నారు. తమ ప్రభుత్వం కుల, మత, వర్గ, ప్రాంత విభేదాలు లేకుండా రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి అని లఫంగి కమిటీలు ప్రజలను దోచుకుతిన్నాయని, సంక్షేమ పథకాలు కావాలంటే లంచాలు దుండుకున్నాయన్నారు. తమ ప్రభుత్వంలో పార్టీ ప్రమేయం లేకుండా వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్ళి అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ బి.బాలస్వామి, కొలుకులూరి ధర్మరాజు, బోణం విజయనిర్మల, పట్నాల గౌరీ గణపతి, ఎంపీపీ దాసరి హైమావతి, సర్పంచ్ భావన ధాన్య లక్ష్మి, టి.జయలక్ష్మి, వాకా వెంకటదుర్గాభవాని, వైస్ ఎంపీపీ శివ, గుండు మోగుల సాంబయ్య, కర్నాటి కన్నయ్య, కెకాల శ్రీనివాసు, సంపతరావు కృష్ణారావు, మిద్దే ఆదినారాయణ, రెడ్డి సూరిబాబు పాల్గొన్నారు.



ఆకివీడు : సిద్ధాపురంలో కోడి పందేల బరిని ట్రాక్టర్‌తో దున్నిస్తున్న ఎస్సై కె.రాజారెడ్డి

కోడిపందేల బరులు ధ్వంసం



నూజివీడు : అడవినెక్కలంలో మామిడి తోటలో సిద్ధం చేసిన కోడిపందేల బరిలో ఫెన్సింగ్ స్తంభాలు ధ్వంసం చేస్తున్న సీఐ అంకబాబు, ఎస్సై చంటిబాబు

కోడిపందేలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లాలో ఇప్పటికే సిద్ధం చేస్తున్న బరులను గుర్తించి ధ్వంసం చేస్తున్నారు. ఆకివీడు మండలం సిద్ధాపురంలో ఎస్సై కె.రాజారెడ్డి ఆధ్వర్యంలో బరి కోసం సిద్ధం చేసిన ప్రాంతాన్ని ట్రాక్టర్‌తో దున్నించి వేశారు. అలాగే ఆగిరిపల్లి మండలం అడవి నెక్కలం గ్రామంలో సిద్ధం చేసిన కోడిపందేల బరిలో ఫెన్సింగ్ స్తంభాలను నూజివీడు రూరల్ సీఐ ఆర్.అంకబాబు, ఆగిరిపల్లి ఎస్సై ఎస్.చంటిబాబు ధ్వంసం చేశారు. సీఐ మాట్లాడుతూ తోట యజమానిపై బైండోవర్ కేసు నమోదు చేసి తహసీల్దార్ కోర్టులో హాజరుపరుస్తామన్నారు. ఇప్పటివరకు తమ సర్కిల్ పరిధిలో 70 మంది కోడికత్తుల తయారీదారులను, 42 మంది పందెంరాయుళ్లను బైండోవర్ చేశామన్నారు.

– నూజివీడు/ఆకివీడు

ఇంటింటా పథకాల లబ్ధి



తాడేపల్లిగూడెం రూరల్ : చినతాడేపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

కోడికత్తులు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కోడికత్తులు, నిందితుడితో (ముసుగు వ్యక్తి)తో డీఎస్పీ కేవీ సత్యనారాయణ

జంగారెడ్డిగూడెం: సంక్రాంతికి కోడిపందేల కోసం సిద్ధంగా ఉంచిన 56 కోడికత్తులను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ కేవీ సత్యనారాయణ చెప్పారు. పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జూద క్రీడలపై ఉక్కుపాదం మోపినట్లు తెలిపారు. సంక్రాంతి నేపథ్యంలో ఎవరైనా కోడిపందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కోడిపందేలను నియంత్రించేందుకు కోడికత్తులు కట్టే వారిపై నిఘాపెట్టి, వారిని అరెస్టు చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ నేపథ్యంలో తమకు అందిన సమాచారం మేరకు ఎస్సై ఎం.సాగర్ బాబు, ఐడీ పార్టీ ఏఎస్సై సంపత్, సిబ్బందితో కలిసి స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో దాడి చేశామన్నారు. దీనిలో భాగంగా కులిపిలి సత్యనారాయణ ఇంటిలో తనిఖీ చేయగా 56 కోడికత్తులు లభించాయన్నారు. సత్యనారాయణ ఏటా కోడికత్తులు తయారు చేసి అమ్ముతుంటాడన్నారు. ఇతన్ని అరెస్టు చేసి కోడికత్తులు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ తెలిపారు.

చికిత్స పొందుతూ పెయింటర్ మృతి

భీమడోలు: బైక్‌పై వెళుతుండగా టైరు పంక్చరై అదుపు తప్పిన ఘటనలో తీవ్ర గాయాల పాలైన ఓ యువకుడు విజయవాడలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. అర్జావారిగూడెంకు చెందిన గూండ్రు విజయ్‌ప్రకాష్ (23) ఇంటర్ వరకు చదివి పెయింటింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. గత నెల 31న రాత్రి ప్రత్తికోళ్లలంకలో పనులు ముగిసిన అనంతరం స్నేహితుడిని దించేందుకు మేస్త్రికి చెందిన బైక్‌పై గుండుగొలను వెళ్లాడు. అనంతరం తిరిగి వెళుతుండగా, భోగాపురం శివారులోకి వచ్చేసరికి బైక్ ముందు చక్రం పంక్చర్ కావడంతో అదుపుతప్పి పడటంతో తీవ్రగాయాలయ్యాయి. అతనిని చికిత్స నిమిత్తం ఏలూరుకు, అక్కడ నుంచి మెరుగైన వైద్యం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విజయ్ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై చావా సురేష్‌కుమార్ శనివారం చెప్పారు.

గురుకుల విద్యార్థిని మృతిపై విచారణ



గురుకుల పాఠశాలలో విచారణ చేస్తున్న ఇన్‌చార్జి డీఎంఅండ్ హెచ్‌ఓ నాగేశ్వరరావు, అధికారులు

ద్వారకాతిరుమల: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థిని జెస్సిక మృతిపై ఉన్నతాధికారులు శనివారం విచారణ చేపట్టారు. లింగపాలెం మండలం నరసన్నపాలెంకు చెందిన జెస్సిక గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. తీవ్ర జ్వరం బారిన పడిన ఆమె ఈ నెల 3న ఇంటికి వెళ్లి అక్కడ చికిత్స పొందింది. అయితే పరిస్థితి విషమించడంతో ఈ నెల 5వ తేదీ తెల్లవారుజామున జెస్సిక మృతి చెందింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థిని మృతిపై ఇన్‌చార్జి డీఎంఅండ్ హెచ్‌ఓ ఎం.నాగేశ్వరరావు, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదనరావు, డీసీఓ వాసవి, మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ విచారణ చేపట్టారు. దీనిలో భాగంగా గురుకుల పాఠశాల, పరిసరాలను పరిశీలించారు. అలాగే విద్యార్థులు తింటున్న ఆహారం, తాగుతున్న మంచినీటి శాంపిల్స్‌ను సేకరించి, పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి డీఎంఅండ్ హెచ్‌ఓ నాగేశ్వరరావు పాఠశాల ప్రిన్సిపల్ బెజవాడ రాణికి, సిబ్బందికి పలు సూచనలు, సలహాలనిచ్చారు. ముఖ్యంగా సెలవులకు ఇంటికి వెళ్లి తిరిగి పాఠశాలకు వచ్చే విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. పాఠశాలలో పారిశుద్ధ్యం బాగానే ఉందన్నారు.

ఆవరణలో పందెం కోళ్ల పెంపకం

గురుకుల పాఠశాల ఆవరణలో ఒక ఉపాధ్యాయిని పందెం కోళ్లను పెంచడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఆహ్లాదకర వాతావరణం, అందులోనూ విద్యార్థినులు సంచరించే ప్రాంతంలో కోళ్ల పెంపకం ఏమిటని స్థానికులు మండిపడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

క్లుప్తంగా

11న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అత్తిలి: ఈనెల 11న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు చెప్పారు. బుధవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ మక్కా సూర్యనారాయణ అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

అద్భుత ఆవిష్కరణలు జరగాలి



వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో 2కె23లో పాల్గొన్న పాలకమండలి సభ్యులు, విద్యార్థులు

తాడేపల్లిగూడెం: విద్యార్థుల ఆలోచనలు అద్భుత ఆవిష్కరణలకు మూలం కావాలని వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన హాకోవర్‌ఫ్లో2కె23 కార్యక్రమంలో వక్తలు పిలుపునిచ్చారు. కళాశాల అడ్మినిస్ట్రేషన్ , ఈ-ఎడ్యుకేషన్, హెల్త్‌కేర్, ట్రాన్స్‌పోర్టు, సోషల్ నెట్‌వర్కు తదితర అంశాల్లో ఎదురయ్యే సవాళ్లు , సాంకేతికత ద్వారా వాటి పరిష్కారానికి ఏం చేయవచ్చనే విషయాలపై విద్యార్థులకు శుక్రవారం నుంచి శనివారం వరకు 24 గంటల హాకథాన్ నిర్వహించారు.వాసవీ ఇంజనీరింగ్ కళాశాలతో పాటు మిగిలిన కళాశాలల నుంచి 79 టీంలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. ముగ్గురు నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో వాసవీ పాలకమండలి అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలి



అలంపురం అమర్‌జవాన్ స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పెంటపాడు: కార్గిల్ ఉదంతాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని దేశభక్తిని పెంపొందించుకొని ఉన్నతులు కావాలని తునికి చెందిన ఎయిర్ వెటరన్ ఛీఫ్‌ప్యాటరన్, సీబీఆర్ స్పోర్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ సీబీఆర్ ప్రసాద్ పేర్కొన్నారు. గత నెల 16న అలంపురం టీబీఆర్ సైనికస్కూల్లో 51వ కార్గిల్ విజయ్ ముగింపు కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా రాష్ట్ర సైనిక సంక్షేమ సంఘ కన్వీనర్ తనబుద్ధి భోగేశ్వరరావు ఆధ్వర్యంలో సీబీఆర్ స్పోర్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ సీహెచ్ బాబూ రాజేంద్రప్రసాద్ (సీబీఆర్) ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశం కోసం ప్రతిఒక్కరూ సేవ చేయాలన్నారు. చిన్ననాటి నుండే విద్యార్థులు కేవలం చదువే కాకుండా దేశ భద్రత, సామాజిక, సేవా రంగాల్లో ఆసక్తిని పెంచుకోవాలన్నారు. సైనికస్కూల్లో చదివే ప్రతి విద్యార్థి దేశభక్తిని పుణికిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



విప్పర్రు గ్రామంలో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాస్

పెంటపాడు: జగనన్న లే అవుట్లో మరింత ప్రగతి సాధించాలని, లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు పూర్తి స్థాయిలో చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి ఎస్ఎస్ఎస్ శ్రీనివాస్, హౌసింగ్ డీఈ ప్రసాద్‌లు పేర్కొన్నారు. శనివారం దర్శిపర్రులోని పాలూరి లక్ష్మీనారాయణ లే అవుట్, విప్పర్రులోని జమ్ముల చెరువు లేఅవుట్‌లను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో లబ్ధిదారులతో మాట్లాడారు. పలు గ్రామాల్లో ఇంకా నిర్మాణాలు చేపట్టకపోవడంపై స్థానిక సర్పంచ్‌లు, అధికారులను ప్రశ్నించారు. ఎస్ఎస్‌లో ఉన్న ఇళ్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనపరచాలన్నారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బి. రాజేంద్రకుమార్ వర్కు ఇనస్పెక్టర్‌లు జయరాజు, ప్రసాద్, ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ సహాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

సాక్షి, భీమవరం: పట్టణంలోని శ్రీవిష్ణు ఇంజనీరింగ్ కళాశాల, భారతీయ విద్యాభవన్స్ స్కూల్లో శనివారం సంక్రాంతి సంబరాలు ఎంతో వైభవంగా నిర్వహించారు. సంప్రదాయ ఎండ్ల బండ్లు, భోగిమంటలు, హరిదాసు, గరగనృత్యాలు, బుట్టబొమ్మలు, గొబ్బెమ్మలు, కోలాటం,హరిదాసులు, గంగిరెద్దులు, జంగమదేవరులు, పిట్టలదొర, సోది, కొమ్మదాసులు, ఆంజనేయస్వామి వంటి వేషధారణలతో కళాకారులు ఆకట్టుకున్నారు. అలాగే విష్ణు కళాశాలలో సంప్రదాయ పిండి వంటలు, ఇతర రుచులతో 30 స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. గుర్రపుస్వారీ, ఒంటె స్వారీ, ఆవులు, పెంపుడు కుటీళ్లు, విద్యార్థులను ఆకట్టుకోగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

సీఎం జగన్‌తోనే సుస్థిరపాలన

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- చినతాడేపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం



చినతాడేపల్లి గ్రామంలో భాగంగా గడపగడపకు మన ప్రభుత్వంలో మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సుస్థిర పాలన సాధ్యమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శనివారం సాయంత్రం తాడేపల్లిగూడెం మండలం చినతాడేపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. కుల, మతాలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. అందరికీ న్యాయం చేయాలనేది సీఎం జగన్ ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. పారదర్శక పాలన రాష్ట్రంలో సాగుతుందని కొనియాడారు. గత టీడీపీ ప్రభుత్వ పాలన దోచుకోవడానికే సరిపోయిందన్నారు. దీనికి చినతాడేపల్లి గ్రామమే నిదర్శనమన్నారు. చంద్రబాబు తన సీటు కాపాడుకోవడానికి అవినీతిని పెంచి పోషించారని దుయ్యబట్టారు. చంద్రబాబు దుర్మార్గానికి కందుకూరు, గుంటూరు మరణాలే నిదర్శనమని, మృతుల కుటుంబాలకు ఎవరు దిక్కు అని ప్రశ్నించారు. అప్పటికీ చంద్రబాబు కంట కన్నీటి బొట్టు కూడా రాలేదన్నారు. ఇది చంద్రబాబు నైజమని పేర్కొన్నారు. అనంతరం ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిని వివరించారు. పలువురికి పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పి.శేషులత, వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, తహసిల్దార్ వైకేవీ.అప్పారావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ, మండల ఉద్యాన శాఖ అధికారి ప్రియదర్శిని, పీఆర్ డీఈ వేణుగోపాల్, ఏపీఎం లక్ష్మి, ఉపాధి హామీ పథకం ఏపీవో ఏవీవీఎస్‌వి.ప్రసాద్, మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్, మండల పరిషత్ ఏవో సుజాత, ఆర్ఐ కే.శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి బి.రమేష్, టి.రవిచంద్ర, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ముప్పిడి పెద్దబ్బులురెడ్డి, కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, ఉప సర్పంచ్ చిట్టూరి కాశీవిశ్వనాథం, ఎమ్పీటీసీ దూలపల్లి సత్తియ్య, మార్లపూడి సుబ్బారావు, జంపెల్ల సత్యవతి, నార్ని శంకరరావు, జద్దు హరిబాబు, పరిమి తులసీదాస్, చిక్కాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు దిక్సూచి ఆర్‌బీకేలు

తాడేపల్లిగూడెం రూరల్: రైతులు రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని చినతాడేపల్లి గ్రామంలో రూ.47.30లక్షలు వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, ఎరువుల గోదాము, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన వ్యవసాయ సలహాలు, సూచనలు అందించడం జరుగుతుందన్నారు. వ్యవసాయాధికారుల సూచనలను పాటించడం ద్వారా సాగులో ఖర్చులను తగ్గించుకోవచ్చన్నారు. సాగుకు అవసరమైన మేర మాత్రమే నీరు అందించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. దేశానికి ఆదర్శవంతమైన పాలనను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పానుకుమాటి శేషులత, వైఎస్సార్‌సీపీ నాయకురాలు ముద్రగడ లలితకుమారి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కొల్లా విజయలక్ష్మి కుమారి, ఏఎంసీ డైరెక్టర్ తమ్మిశెట్టి చుక్కయ్య, నూనె గౌతమి, కారింకి వీర్రాజు, కొలుకులూరి ధర్మరాజు, బొద్దాని శ్రీనివాస్, మద్దుకూరి మెహెర్‌ప్రసాద్, పోలిమోను శ్రీనివాస్, దారపురెడ్డి శ్రీనివాస్, ములగాల రాంబాబు, ఎంఎల్‌హెచ్‌పీ దివ్య, హెల్త్ సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మాలతి

ఇరగవరం: కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మాలతి అన్నారు. ఇరగవరం, తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడిపందేలు, గుండాట, కోతాట, పేకాట వంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సంక్రాంతి అంటే కుటుంబ సభ్యులు సంతోషంగా గడపాలన్నారు. జూదాలు వల్ల కుటుంబాలు నాశనం అవుతాయన్నారు. ప్రతీ ఒక్కరూ జూదాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో బరులు సిద్ధం చేసిన బరులకు స్థలాలు ఇచ్చినా నిర్వహకులపై కూడా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. గ్రామస్థాయిలో అధికారులు ఎప్పటికపుడు పర్యవేక్షిస్తూ ఎక్కడైనా జూదం వంటివి నిర్వహిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఉంటే ఉన్నతాధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు. సంక్రాంతి పూర్తి అయ్యే వరకు గ్రామ స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు . ఈ కార్యక్రమంలో మండల వీఆర్‌వోలు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి గానామృతం



నందిబొమ్మ రామాలయంలో మహిళా సభ్యులచే వేంకటేశ్వరస్వామి గానామృతం దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని నందిబొమ్మ సెంటర్‌లో వేంచేసియున్న విఘ్నేశ్వర రామాలయంలో శనివారం వేంకటేశ్వర స్వామి గానామృతం వైభవంగా జరిగింది. శ్రీరామ రక్ష స్తోత్ర కమిటీ మహిళా సభ్యులు పాల్గొన్నారు. ఉదయం నుంచి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

రాష్ట్రీయ కిశోర్ స్వాస్థ్యను విజయవంతం చేయాలి



ముదునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న దృశ్యం

పెంటపాడు: రాష్ట ప్రభుత్వం ప్రభుత్వ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన కిశోర్ స్వాస్థ్య వైద్యపరీక్షలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ముదునూరు ప్రాథమిక వైద్యాధికారి ఎస్వీ రమణ కోరారు. శనివారం ముదునూరు గ్రామంలోని విద్యార్థులకు ఐరన్‌మాత్రలు పంపిణీ చేసారు. అనంతరం స్కూలు ఉపాధ్యాయులతో మట్లాడి పరిశుభ్రత పై విద్యార్థులకు అవగాహన కల్పించి పలువురి విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో సత్యనారాయణ, ఏఎన్ఎం మోహిని, హెల్త్ సహాయకులు రామకృష్ణ, సూపర్‌వైజర్ బాలాజీ, ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

శరవేగంగా జగనన్న ఇళ్ల నిర్మాణాలు



తేతలిలో లబ్ధిదారులకు నిర్మించే ఇళ్లను పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

తణుకు టౌన్: నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల పథకంలో తణుకు మండలంలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు గృహాలను వేగవంతంగా నిర్మిస్తున్నారు. ముఖ్యంగా ఆప్షన్-3 ను ఎంపిక చేసుకున్న లబ్ధిదారులకు ప్రత్యేక ఏజెన్సీ ద్వారా ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతున్నాయి. చరిత్రలో ఎన్నడూ లేనంతగా తణుకు నియోజకవర్గంలోని అర్హులైన పేదలందరికీ రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఇళ్ల పట్టాలను పంపిణీ చేయడంతో ప్రభుత్వం అందించిన స్థలంలో కొందరు సొంత నిధులతో ఇళ్లను నిర్మించుకోగా, మరి కొందరు ప్రభుత్వం అందించిన సహాయంతో స్వయంగా నిర్మించుకుంటున్నారు. సొంతంగా ఇల్లు నిర్మించుకోలేని వారు ప్రభుత్వం అందించే సబ్సిడీ సహాయంతో పాటు స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళలకు అందించే రూ. 35 వేల ఆర్థిక సహాయంతో రూ. 2.15 వేలతో పాటు లబ్ధిదారులు మరో 20 వేలు సొంత సొమ్ము కలిపి ప్రత్యేకంగా ఏజెన్సీల ద్వారా నిర్మించుకుంటున్నారు. రూ. 20 వేలు కలపడం వలన బేస్మెంట్ పెంచడంతో పాటు, మరుగుదొడ్డును బయట నిర్మించుకుంటున్నారు. తణుకు నియోజకవర్గంలో మొత్తం 117 లే అవుట్‌లు ఏర్పాటు చేయగా వాటిలోని 15, 523 గృహాల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. వాటిలో 2,647 గృహాల నిర్మాణం పూర్తి కాగా, 3,770 గృహాలు వివిధ దశల్లో వున్నాయి. వీటితో పాటు ప్రభుత్వం ఇచ్చిన ఆప్షన్ 3లో వారం రోజుల్లో 1,135 ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. ప్రస్తుతం ప్రత్యేక యంత్ర సామాగ్రి ద్వారా ఈ గృహాల నిర్మాణం వేగంగా జరుగుతుంది. మండల గృహ నిర్మాణ ప్రత్యేక అధికారి పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ సిబ్బందితో పాటు సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో ఆప్షన్ 3 గృహాలను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం మండలంలోని మహాలక్ష్మీ చెరువు, మండపాక, వేల్పూరు, దువ్వ, తేతలి, కోనాల, ముద్దాపురం గ్రామాల్లోని లబ్ధిదారులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఆయా గ్రామాల్లోని లబ్ధిదారులు ప్రత్యేక ఏజెన్సీల ద్వారా ఆప్షన్ 3లో గృహాలను నిర్మించుకునేందుకు ముందుకు వస్తున్నారు.

ప్రభుత్వమే ఇళ్లు నిర్మించడం ఆనందంగా ఉంది



మాకుటుంబంలో ఐదుగురు కుటుంబ సభ్యులున్నారు. ప్రభుత్వం ఇంటి పట్టా ఇచ్చినా ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమైన సొమ్ము మావద్ద లేదు. దీనితో గత సంవత్సర కాలంగా ఇళ్ల నిర్మాణం ప్రారంభించలేదు. దీనితో అధికారులు స్వయం సహాయ సంఘం ద్వారా వచ్చే రూ. 35 వేలతో పాటు మరో 20 వేల సొంత సొమ్ము ఇస్తే సరిపోతుందని చెప్పడంతో ఇళ్లు నిర్మించుకుంటున్నాము.

–మద్దిల రమణ, ఆప్షన్ 3 లబ్ధిదారు, తేతలి

పనులు చాలా నాణ్యంగా జరుగుతున్నాయి



పేదలకు ప్రభుత్వం ఆప్షన్ 3 ద్వారా నిర్మిస్తున్న ఇళ్లు యంత్రాల సహాయంతో జరుగుతున్నాయి. ఈ ఇళ్లు ప్రభుత్వ అధికారులు దగ్గర ఉండి చూడటంతో చాలా త్వరగా పనులు జరుగుతున్నాయి. మాకు నచ్చిన విధంగానే ఇంటి పనులు జరుగుతున్నాయి.

–సొంటి దుర్గ, ఆప్షన్ 3 లబ్ధిదారు, తేతలి

ఉగాది నాటికి పూర్తి చేస్తాం



నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకంలో తణుకు మండలంలోని ఆప్షన్ 3 కేటగిరీ కింద నిర్మాణం చేపట్టిన గృహ నిర్మాణాలను ఉగాధి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో చేపట్టాం. ఆప్షన్ 3 కింద తణుకు నియోజకవర్గంలో 1,135 నిర్మాణాలు ప్రారంభించాం. ఈ గృహాల నిర్మాణాల పూర్తి చేయడం ద్వారా మరింత మంది ముందుకు వస్తారు.

–పీ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ,

పేదల సంక్షేమమే జగన్ లక్ష్యం



మండపాకలో కొత్తగా మంజూరైన పింఛన్‌లను పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తణుకు టౌన్: పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోడపాటి వీర్రాజు తెలిపారు. తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్‌లను నాయకులు, అధికారులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. శనివారం గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్‌ను లబ్ధిదారులకు వలంటీర్లతో కలసి నాయకులు, అధికారులు వారి ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోడపాటి వీర్రాజు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్‌లను ప్రతీ ఏటా పెంచుతూ ఉన్నారని చెప్పారు. ఈ నెల నుంచి ప్రతి ఒక్కరికీ రూ. 2,750లను పింఛన్‌గా అందిస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని కోరారు. మండపాక గ్రామంలో కొత్తగా 54 మందికి కొత్తగా పింఛన్‌లు మంజూరు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కాళ్ల సన్యాసిరావు, సొసైటీ అధ్యక్షురాలు వై విజయ మహాలక్ష్మి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ఎం యుగంధర్ శ్రీనివాస్, సూర్య మణికంఠ, రాజేష్ బాబు, వినీత, పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



ఇరగవరం జిల్లా పరిషత్ జెడ్పీ హైస్కూల్‌లో క్రీడాకారులను అభినందిస్తున్న సీఐ

ఇరగవరం: క్రీడలతో మానసిక ఉల్లాసం సాధ్యమని తణుకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు అన్నారు. శనివారం ఇరగవరం మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో మండలంలోని యువతకు పోలీసుల ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ నేపథ్యంలో యువత సంప్రదాయ క్రీడలు మాటున పేకాట, కోడిపందాలు, గుండాట వంటి జూదాలు బాట పడకుండా ఉండేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. గ్రామీణ క్రీడలను పోత్సహించాలనే ఉద్దేశ్యంతో క్రీడాభిమానులు, స్వచ్ఛంధ సహకారంతో వాలీబాల్ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ క్రీడలు రెండు రోజులు పాటు జరుగుతాయని మొత్తం 8 జట్లు పాల్గొనగా అందులో ఒక జట్టును ఎంపిక చేసి విజేతగా ప్రకటించడం జరుగుతుందన్నారు. మండలంలోని యువత పెద్ద ఎత్తున క్రీడల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కె. చంద్రశేఖర్, తహసీల్దార్ బి. మాలతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతల సహకారం మరువలేనిది

పెంటపాడు: కె.పెంటపాడు గ్రామ దేవత పెంట్లమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి దాతలు సహకారం మరువలేనిదని ఆలయ కమిటీ చైర్మన్ పంతం సూర్యచంద్రశేఖర్ అన్నారు. గ్రామ దేవత పెంట్లమ్మ అమ్మవారి ఆలయానికి గ్రామాని చెందిన దాత గంథం సతీష్ సతీమణి లతా పద్మశ్రీ రూ. 2.20 లక్షలను విరాళంగా అందజేశారు. ఈ సొమ్ముతో ఆలయ ఆవరణ మొత్తం కాంక్రీట్ ఫ్లోరింగ్ చేయించారు. గత రెండు రోజుల నుంచి చేస్తున్న ఈ పని శనివారం నాటికి పూర్తైంది. ఈ సందర్భంగా ఆలయ నూతన కమిటీ చైర్మన్ పంతం సూర్యచంద్రశేఖర్, వైస్ చైర్మన్ ఆదిరెడ్డి శివ, కార్యదర్శి నరాలశెట్టి సంతోష్ తదితరులు దాతలైన దంపతులు సతీష్,లతా పద్మశ్రీలను అభినందించారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి భవిష్యత్తులో మరిన్ని సేవాకార్యక్రమాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గ్రామ ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చోడగిరి పెదబాబు, మల్లెల ప్రసాద్, సర్పంచ్ పీతల సత్యనారాయణ, వీరాబత్తుల రవి తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఉండి: మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులు వాడితే వరిపంటకు నష్టమని ఏడీఏ కేఏఎస్ఎస్ శ్రీనివాస్ అన్నారు. మండల వ్యవసాయాధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో ఉండి మండలం ఉప్పులూరు రైతు భరోసా కేంద్రంలో వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఏడీఏ శ్రీనివాస్ మాట్లాడుతూ వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులు అధిక దిగుబడికి, తక్కువ ఖర్చుతో లాభసాటిగా వ్యవసాయానికి ఉపకరిస్తాయని అన్నారు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాల మేరకే వరిసాగులో ఎరువులు పురుగుమందులు వాడాలని సూచించారు. సమగ్ర నీటి యాజమాన్య పద్ధతులు పాటించకపోతే దుబ్బు ఎదుగులపై ప్రభావం చూపిస్తుందన్నారు. నాట్లు వేసే సమయంలో నాటుకు నాటుకు మధ్య సరైన దూరం పాటించడం ద్వారా పంటకు మంచిగాలి, ఎదిగేందుకు సరైన అవకాశం దొరికి మంచి దిగుబడులు సాధించవచ్చునని వివరించారు. తెగుళ్ల భారి నుంచి పంటను కాపాడుకోవచ్చన్నారు. తెగుళ్లు సోకకముందే పురుగుమందుల పిచికారీ పంటకు ప్రమాదకరంగా మారుతుందని చెప్పారు. గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో వ్యవసాయాధికారులు అందుబాటులో ఉంటారని ఎటువంటి సమాచారాన్నయినా వారి నుంచి పొందవచ్చునని తెలిపారు. డీఆర్‌సీ ఏఓ కాళీమాత, ఏఓ బి.సంధ్య, సర్పంచ్ యర్రా దుర్గారావు, ఎంపీటీసీ నిమ్మల కేశవకుమార్, వీఏఓ ఎం మహేంద్ర,పలువురు రైతులు పాల్గొన్నారు.

దిశయాప్‌ను ప్రతి ఒక్కరూ ఇన్‌స్టాల్ చేసుకోవాలి



అత్తిలిలో దిశయాప్‌ను ప్రజల మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేయిస్తున్న పోలీసులు

అత్తిలి: ప్రతి ఒక్కరూ దిశ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని ఎస్సై కేసీహెచ్ స్వామి చెప్పారు. అత్తిలి బస్‌స్టేషన్ సెంటర్‌లో శనివారం మహిళా సంరక్షణ కార్యదర్శులు దిశయాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రయాణికుల మొబైల్‌లో దిశయాప్‌ను డౌన్‌లోడ్ చేసారు. దిశయాప్ కలిగి ఉండటం వల్ల ఆపద సమయంలో రక్షణగా నిలుస్తుందని, ప్రతి ఒక్కరూ ఈయాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని ఏఎస్సై ఎన్ వెంకట్రావు తెలిపారు.

ఈ- క్రాప్ త్వరితగతిన పూర్తి చేయాలి



వీఆర్‌వోలు, వీఏఏల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ పి. మురళీకృష్ణ

పెంటపాడు: రైతులకు ఇబ్బందులు లేకుండా వ్యవసాయశాఖతో పాటు, రెవిన్యూ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని గూడెం వ్యవసాయశాఖ ఏడీఏ పి. మురళీకృష్ణ, తహసిల్దార్ జీవీ శేషగిరి రావులు పేర్కొన్నారు. పెంటపాడు తహసిల్దార్ కార్యాలయంలో శనివారం వీఆర్వోలు ,వీఏఏల తో అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాళ్వాకు సంబంధించి ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు లేకుండా ఈ- క్రాప్ విషయంలో త్వరితగతిని పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సారథి, ఆర్ఐ కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి ట్యాబ్ పంపిణీ

కాళ్ల: పదో తరగతిలో ఫస్ట్ క్లాస్ వచ్చిన విద్యార్థికి బైరాజ్ ఫౌండేషన్ ద్వారా ప్రోత్సాహాలు అందించడం అభినందనీయమని కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.సత్యనారాయణ మూర్తి తెలిపారు. బైర్రాజు అప్పల నరసమ్మ జ్ఞాపకార్థం కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో స్కూల్ ఫస్ట్ వచ్చిన కొర్రకూటి మధు వెంకట సత్తిబాబుకు శనివారం ట్యాబ్ బహూకరించారు. బైర్రాజు ఫౌండేషన్ గ్రామ వికాస సమితి కన్వీనర్ పెన్మత్స రంగరాజు, స్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.సత్య నారాయణమూర్తి, బైర్రాజు ఫౌండేషన్ కోఆర్డినేటర్ పెనుమాక భానుమూర్తి చేతుల మీదుగా అందజేశారు.